క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై ప్రజల హర్షం



మేనిఫెస్టోపై మీడియాతో మాట్లాడుతున్న కె.కె.రాజు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన పార్టీ మేనిఫెస్టోపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 54వ వార్డు కార్పొరేటర్ చల్లా రజని ఆధ్వర్యంలో ఆదివారం ఊర్వశి జంక్షన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మేనిఫెస్టోపై ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కొనసాగుతాయని సీఎం జగన్ స్పష్టం చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ పాలనకు నాందిపలికేలా ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ గెలుపునకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిని చేసుకుంటే పేదల జీవితాలు బాగుపడతాయన్నారు.

నేటి నుంచి జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ

సీతంపేట: విభిన్న ప్రతిభావంతులకు రెండు వారాల పాటు జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ ఇస్తున్నట్టు ప్రజ్వల్ వాణి వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి సుచిత్రా రావు ఒక ప్రకటనలో తెలిపారు. అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని పురందేశ్వరి కమ్యూనిటీ హాల్‌లో ఈ నెల 29 నుంచి రోజుకు మూడు గంటల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం ఆసక్తి గల వారికి యూనిట్ ఏర్పాటు కోసం అవసరమైన వివరాలను, వర్క్ ఆర్డర్ కూడా ఇస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు శిక్షణకు హాజరుకావాలని, వివరాలకు 93479 73327 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

కంచి విశ్వవిద్యాలయంలో ప్రవేశాలకు ఆదరణ

సీతంపేట: చంద్రశేఖర విశ్వవిద్యాలయంలో ప్రవేశాల కోసం స్థానిక శంకరమఠంలో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సుకు అపూర్వ ఆదరణ లభించింది. సుమారు 300 మంది విద్యార్థులు వివిధ తరగతులు, ఇంజినీరింగ్ విద్యలో ప్రవేశాలు పొందారు. ముఖ్య అతిథులు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ చీఫ్ కన్వీనర్ యామిజాల నరసింహమూర్తి, ఆచార్య వేదుల సుబ్రహ్మణ్యశాస్త్రి కంచి విశ్వవిద్యాలయం ప్రాముఖ్యాన్ని వివరించారు. భారత సంప్రదాయ విధానం ద్వారా ఇంజినీరింగ్, ఉన్నత విద్య బోధించే ఏకైక విశ్వవిద్యాలయంగా పేరుగాంచిందన్నారు. ప్రొఫెసర్ నాగేశ్వర్ విశ్వవిద్యాలయంలోని సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో శంకరమఠం అధ్యక్షుడు డాక్టర్ రవిరాజు, కార్యదర్శి అచ్యుతరామయ్య, కోశాధికారి నరసింహమూర్తి పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.1.13 లక్షల సీజ్

కంచరపాలెం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉత్తర ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ కలెక్టర్ డి.అఖిల ఆదేశాల మేరకు ఎయిర్‌పోర్ట్ పోలీసులు జాతీయ రహదారి బిర్లా కూడలి వద్ద చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశారు. పోలీసులు, జీవీఎంసీ అధికారుల నేతృత్వంలో ఆదివారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. సాయంత్రం ఓ కారును తనిఖీ చేయగా రూ.1,13,500ను అధికారులు పట్టుకున్నారు. సరైన పత్రాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు వారు తెలిపారు. స్టాటిక్ సేవలర్, జీవీఎంసీ జోన్-5 ఏపీడీ కె.పద్మావతి ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ వరలక్ష్మి, ఏఆర్ ఉమెన్ కానిస్టేబుల్ అనుషా, పీసీ స్వాతి, వీడియోగ్రాఫర్ సాయి విధులు నిర్వహించారు. ఏపీడీ పద్మావతి మాట్లాడుతూ ఎన్నికల్లో భారీగా మద్యం, నగదు చేతులు మారే అవకాశం ఉండొచ్చనే అనుమానంతో విస్తృతంగా తనిఖీలు చేపట్టామన్నారు.

223 మందికి వైద్య పరీక్షలు

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏబీ మెడికల్ సర్వీసెస్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో గుండె వ్యాధుల నిపుణుడు డాక్టర్ పృథ్వీరాజ్ అట్లా(కేర్ హాస్పిటల్స్), చర్మ వ్యాధులు, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సిరి, జనరల్ ఫిజీషియన్, ఆర్థరైటిస్, డయాబెటిస్ వ్యాధుల స్పెషలిస్ట్ డాక్టర్ యడ్ల దిలీప్‌రాజా(నిమ్స్) పాల్గొని 223 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 154 మందికి ఈసీజీ, 21 మందికి 2డీ ఎకో పరీక్షలు, బీపీ, సుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. . వైద్యులను క్లబ్ సభ్యులు సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు, జాలీవాకర్ ఎన్.ప్రకాశరావు, పూర్వ అధ్యక్షులు ఎన్.బుచ్చయ్య, కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులు ఎ.వి.సుబ్బారావు, సభ్యులు శిబిరం నిర్వహణకు సహకరించారు.



అందరివాడు అందనివాడు



- ఏడేళ్లుగా ప్రజల్లోనే వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఉత్తర నియోజకవర్గ అభివృద్ధికి విశేష కృషి
- కరోనా సమయంలోనూ సేవా కార్యక్రమాలు
- నిత్యం జనంతో మమేకం.. సమస్యల పరిష్కారం

- 2019 నుంచి ప్రజల వైపు చూడని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణుకుమార్‌రాజు
- ఎన్నికల సమయంలో లేనిపోని హడావుడి
- 'ఉత్తర'లో మొహం చాటేసిన ఎమ్మెల్యే గంటా

ఉత్తర నియోజకవర్గం.. విశాఖలో రాజకీయంగా ప్రత్యేక స్థానం కలిగిన ప్రాంతం. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఓ వెలుగు వెలిగిన నియోజకవర్గం. గత బీజేపీ, ప్రస్తుత టీడీపీ ఎమ్మెల్యేల అసమర్థత వల్ల అభివృద్ధికి ఆమడ దూరంలో నిలిచి పోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే ఈ నియోజకవర్గానికి మళ్లీ మంచి రోజులొచ్చాయి. ఏడేళ్ల కిందట ఆ పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితుడైన ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అందరివాడిగా ప్రజల్లో మంచిపేరు తెచ్చుకున్నారు. ఉత్తర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం



44వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు (ఫైల్)

తోపాటు పార్టీలకు అతీతంగా ప్రజలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రత్యేక శ్రద్ధ చూపారు. కోవిడ్ విపత్తులోనే నేనున్నానంటూ ప్రజలకు భరోసా కల్పించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టారు.

– సీతంపేట

నిరంతరం ప్రజా సేవలోనే కె.కె.రాజు

2019 ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు(టీడీపీ) మొహం చాటేయడంతో.. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ఉత్తర నియోజకవర్గ ప్రజల సంక్షేమం, బాధ్యతను తన భుజస్కందాలపై వేసుకుని కంటికి రెప్పలా చూసుకుంటూ వస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండటంతో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా సచివాలయ వ్యవస్థను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువయ్యారు.

➡ బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ ఉత్తర కార్యాలయంలో వారంలో నాలుగైదు రోజులు గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. పేద, మధ్యతరగతి ప్రజల కష్టాన్ని, సమస్యను, అవసరాన్ని తెలుసుకుని తక్షణ పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

➡ జీవీఎంసీ ఎన్నికల్లో ఉత్తరలోని 17 వార్డుల్లో 15 చోట్ల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించారు.

➡ కరోనా సమయంలో ప్రతి వార్డుల్లోనూ పర్యటించి వైద్య సేవలు, నిత్యావసర సరకులు ప్రజలకు అందేలా చూశారు.

ప్రతి ఇల్లూ సందర్శన

➡ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉత్తర నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో నిర్వహించారు.

➡ 17 వార్డుల్లోని ప్రతి ఇంటిని సందర్శించి స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు.



54వ వార్డు భవానీ గార్డెన్స్‌లో కొత్తగా నిర్మించిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

➡ ప్రజల అవసరాల మేరకు వార్డుల్లో అభివృద్ధి పనులు, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేశారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

➡ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా నియోజకవర్గంలోని అర్హులందరికీ లబ్ధి చేరేలా చూశారు.

➡ ఈ ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.3,184 కోట్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు చేరేలా శ్రమించారు.

415 మందికి సీఎం రిలీఫ్ ఫండ్

➡ ఐదేళ్లలో ఉత్తర నియోజకవర్గంలో 415 మందికి సుమారు రూ.5.70 కోట్ల విలువైన ఎల్‌వోసీలు, సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం అందించి బాధితుల వైద్యానికి కె.కె.రాజు అండగా నిలిచారు.

టిడ్కో గృహ యోగం

➡ జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం ఏఎస్సార్ నగర్‌లో టిడ్కో గృహ సముదాయం నిర్మాణానికి విశేష కృషి చేశారు. ఏడు బ్లాకుల్లో 280 ఇళ్లను లబ్ధిదారులకు అందజేశారు.



45వ వార్డు తాటిచెట్లపాలెం ఏఎస్సార్ నగర్‌లో నిర్మించిన టిడ్కో గృహ సముదాయం

ఐదేళ్లూ అభివృద్ధి పరవళ్లు

➡ ఉత్తర నియోజకవర్గంలో కె.కె.రాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టారు. ఐదేళ్లలో సుమారు రూ.435 కోట్లతో రోడ్లు, డ్రెయిన్లు, ఆస్పత్రులు, గెడ్డల నిర్వహణ, పార్కులు, బస్ షెల్టర్లు, సామాజిక భవనాలు, కల్యాణ మండపాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు, రహదారుల విస్తరణ, ప్రధాన కూడళ్ల బ్యూటిఫికేషన్.. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు జరిగేలా కృషి చేశారు.

➡ నాడు-నేడులో రూ.4.22 కోట్లతో, స్మార్ట్ సిటీస్ నిధులు రూ.1.96 కోట్లతో 15 పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలు కల్పించారు.

➡ నియోజకవర్గంలో కొత్తగా రూ.5.18 కోట్లతో 6 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. రూ.40 లక్షలతో నాలుగు పాత ఆరోగ్య కేంద్రాలను ఆధునికీకరించారు.

➡ జీవీఎంసీ కార్పొరేటర్ల ఏడాది పదవీ కాలం పూర్తయిన సందర్భంగా ప్రతి వార్డుకు కేటాయించిన రూ.5 లక్షల నిధులతో ప్రతి వార్డులో ఆధునిక వ్యాయామ పరికరాలతో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేశారు.

➡ ప్రతి వార్డులో రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల జీవీఎంసీ నిధులతో బీటీ, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు, గెడ్డల ఆధునికీకరణ చేపట్టారు.

➡ స్మార్ట్ సిటీకి తగ్గట్టు ఉత్తర నియోజకవర్గంలో సుమారు రూ.1.5 కోట్లతో



సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ.2.5 కోట్లతో నిర్మించిన స్నేపర్ పార్క్

ఐదు అత్యాధునిక బస్ బేలు నిర్మించారు.

➡ 14వ వార్డు సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో రూ. 2.5 కోట్లతో అద్భుతమైన స్నేపర్ పార్కును నిర్మించారు.

➡ రూ.4 కోట్లతో మాధవధార బస్‌స్టాప్ నుంచి మారియట్ హోటల్ జంక్షన్ వరకు 1.75 కిలోమీటర్ల పొడవైన రహదారి విస్తరణ, అభివృద్ధి చేశారు.

➡ ఊర్వశి కూడలి నుంచి న్యూ శ్రీనివాసనగర్ వరకు రూ.1.98 కోట్లతో 1.65 కిలోమీటర్ల నిడివి గల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించారు. ఇలా ఎన్నో సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి.. నిత్యం ప్రజా సేవకే కె.కె.రాజు అంకితమయ్యారు. ఎన్నికల్లో ఆయననే గెలిపిస్తామని ప్రజలు అంటున్నారు.



అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీలో అత్యాధునికంగా జీవీఎంసీ ప్రైమరీ స్కూల్



విశాలంగా తీర్చిదిద్దిన కైలాసపురం రోడ్డు

గంటా.. ఐదేళ్లలో ప్రజలకు ఏం చేశావంటా..

ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత నియోజకవర్గం మొహం చూడని నేత ఎవరైనా ఉన్నారంటే ఠక్కున గుర్తొచ్చే పేరు గంటా శ్రీనివాసరావు. 2019 ఎన్నికల్లో ఉత్తర ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన గత ఐదేళ్లల్లో ప్రజలకు ఏమీ చేయలేదు. ఒక్కరోజు కూడా నియోజకవర్గంలో అడుగు పెట్టలేదు. ఒక్క గడప వైపు కూడా తొంగిచూడలేదు. అసలు తనను గెలిపించిన ప్రజలు ఎలా ఉన్నారు, వాళ్ల సమస్యలు ఏంటి, వారి సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి కరోనా సమయంలో సైతం ప్రజల కష్టాల వైపు కన్నెత్తి చూడలేదు. ఈయన ప్రజల కోసం ఏమీ చేయకపోగా.. ఎప్పుడూ 'ఎక్స్'(ట్విటర్)లో ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఆ పార్టీ నాయకులకు కూడా అందుబాటులో లేకుండా ఆయన అజ్ఞాతంలో గడిపేశారు.

విష్ణుకుమార్.. ఓడిపోయాక మొహం చాటేశార్..!

- ఎమ్మెల్యేగా 'ఉత్తర'కు చేసింది సున్నా..

ఈ ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పెనుమత్స విష్ణుకుమార్‌రాజు ప్రజలకు ఎల్లప్పుడూ దూరంగానే ఉన్నారు. 2014 నుంచి 2019 వరకు ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ అభివృద్ధి పనులు చేపట్టలేదు. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి కృషి చేయలేదు. తన ఐదేళ్ల పాలనలో రూ.68 కోట్ల అభివృద్ధి పనులు జరిగితే.. 2019 నుంచి 2024 మధ్య కె.కె.రాజు చొరవతో సుమారు రూ.435 కోట్ల అభివృద్ధి జరిగింది. 2019 ఎన్నికల్లో పోటీచేసి ఘోర ఓటమిని చవిచూశాక ప్రజలకు విష్ణుకుమార్‌రాజు దూరంగా ఉండిపోయారు. మళ్లీ 2024 ఎన్నికలు వచ్చేసరికి లేనిపోని హడావిడి చేస్తూ ప్రజల మధ్యకు వచ్చారు.

కానరాని అభివృద్ధి జాడ

➡ ఉత్తర నియోజకవర్గంలో అరకొర సదుపాయాలతో ఉండే నాలుగు ఆరోగ్య కేంద్రాల అభివృద్ధి గాని, కొత్త ఆస్పత్రుల ఏర్పాటు గాని చేయలేదు.

➡ కొండవాలు ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదనే చెప్పాలి.

టిడ్కో ఇళ్లు.. మోసపోయిన మహిళలు

➡ 2019 ఎన్నికల ముందు టిడ్కో ఇళ్లు మంజూరు చేస్తామని మహిళలను మభ్యపెట్టి వేలాది రూపాయలు డబ్బులు కట్టించారు. తీరా ఇళ్లు మంజూరు కాకుండానే ఎన్నికలు సమీపించడంతో కేటాయింపు ఆగిపోయింది.

➡ నియోజకవర్గానికి 4,500 వరకు టిడ్కో ఇళ్లు మంజూరైతే సుమారు 32 వేల మంది చేత డీడీలు కట్టించి మహిళలను మోసం చేసిన ఘనత విష్ణుకుమార్‌రాజు సొంతం చేసుకున్నారు.

నాడు తెరమరుగు.. నేడు ప్రత్యక్షం

➡ 2019 ఎన్నికల్లో పరాజయం పొందడంతో విష్ణుకుమార్‌రాజు తెరమరుగయ్యారు. కరోనా కష్టకాలంలోనూ నియోజకవర్గ ప్రజలకు ఆయన మొహం చాటేశారు.

➡ ప్రజల కష్టాల్లో కనపడని ఈ నేత.. 'నేను మళ్లీ ఎన్నికల బరిలో ఉన్నాను. నన్ను గెలిపించండి' అని అంటూ ఏ మొహం పెట్టుకుని వస్తున్నారని జనం ఛీకొడుతున్నారు.

జగన్‌తోనే పేదల జీవితాల్లో వెలుగులు

- అండగా ఉంటా.. దీవించమ్మా



కంచరపాలెం బీఆర్‌టీఎస్ రోడ్డులో చేపల వ్యాపారిని ఓటు అభ్యర్థిస్తున్న కె.కె.రాజు

- ఆల్ ది బెస్ట్



కె.కె.రాజుకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న టీడీపీ 54వ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్

- విజయం ప్రాప్తిరస్తు



బాపూజీనగర్‌లో కె.కె.రాజుకు దిష్టి తీస్తున్న మహిళ

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు విరజిమ్మాయని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 54వ వార్డులో కార్పొరేటర్ చల్లా రజని ఆధ్వర్యంలో ఆదివారం ఆయన నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభించింది. ఉదయం రెడ్డి కంచరపాలెం, కొత్తవాడ వీధి, రవీంద్రనగర్, వివేకానంద వీధి, గజపతినగర్, సంకూర్‌పేట, సూర్యానగర్-2, ప్రాంతాలు.. సాయంత్రం 104 ఏరియా, బాపూజీనగర్, విమాన్ స్ట్రీట్, జ్యోతినగర్ ప్రాంతాల్లో ప్రచారం

- వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారానికి విశేష ఆదరణ

చేశారు. స్థానికులు ఆయనకు అడుగడుగునా హారతులు పట్టి స్వాగతించారు. ఐదేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం సాగించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సహకారంతో ఐదేళ్లలో రూ.435 కోట్ల విలువైన పనులు చేపట్టి ఉత్తర నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించానని తెలిపారు. మరింత అభివృద్ధి కోసం తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. గజపతినగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించిన కె.కె.రాజుకు టీడీపీ 54వ వార్డు అధ్యక్షుడు కుట్టా కార్తీక్ ఆల్ ది బెస్ట్ చెప్పడం విశేషం. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు జి.వి.రవిరాజు, వార్డు ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి, వార్డు అధ్యక్షుడు చల్లా ఈశ్వరరావు, కాయిత పైడి రత్నాకర్ యాదవ్, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, కణితి చిరంజీవి, చల్లా వెంకటేష్, తదితర నాయకులు పాల్గొన్నారు.

జోరందుకున్న ప్రచారం

సీతంపేట/మద్దిపాలెం: ఉత్తర నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం 44వ వార్డు ఎంటీసీ పాలెం, అబిద్‌నగర్, శ్రామికనగర్ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు బాణాల తరుణ్.. 25వ వార్డులో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో గురుద్వారా విజయ మెడికల్ సెంటర్ ప్రాంతంలో.. 43వ వార్డు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ నందగిరినగర్‌లో ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణులతో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచి, ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఉత్తర ఎమ్మెల్యేగా కె.కె.రాజును, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు.

➡ 51వ వార్డు కళింగనగర్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, నాయకులు.. 53వ వార్డు హుస్సేన్‌నగర్ పరిసర ప్రాంతాల్లో కార్పొరేటర్ బర్కత్ అలీ, వైఎస్సార్‌సీపీ వార్డుఅధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, రాష్ట్ర మైనారిటీ సెల్ విభాగం కార్యదర్శి షేక్ బాబ్జి తదితర నాయకులతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. సీఎం వైఎస్ జగన్ బలపరిచిన బొత్స ఝాన్సీ, కె.కె.రాజులను గెలిపించి మంచి పాలనను కొనసాగించాలని ఓటర్లను కోరారు.



43వ వార్డు నందగిరినగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణ లో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటరావు మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అల్లర్లు, గొడవలు చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. అనంతరం రౌడీషీటర్లను వారి ఇళ్ల వద్ద పోలీస్ సిబ్బంది అప్పగించారు.

గురుద్వారాలో ప్రార్థనలు



సద్ సంగత్‌లో ప్రార్థనలు చేస్తున్న కె.కె.రాజు

సీతమ్మధార: గురుద్వారా జంక్షన్‌లోని గురుద్వారా సద్ సంగత్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. సిక్కు వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ ఆనంద్ సింగ్ పిలుపు మేరకు సద్ సంగత్‌ను కె.కె.రాజు సందర్శించారు. అనంతరం ఆయనకు సిక్కులను పరిచయం చేశారు. వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ రాబో యే రోజుల్లో విశాఖ నగరం అద్భుతంగా మారబోతుందన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించు కోవాల్సిన అవసరముందని, తన గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కె.వి.బాబా, ఎం.సునీల్‌కుమార్, అంబటి శైలేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వండి

తాటిచెట్లపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు తెలిపి, సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు కోరారు. సుబ్బలక్ష్మీ నగర్‌లోని సుబ్బలక్ష్మీ కల్యాణ మండపంలో కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు పట్నాన శ్రీనుల ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అన్ని వర్గాలకు సమన్యాయం

ముఖ్య అతిథులు రాష్ట్ర మంత్రి బొత్స సత్యనారాయణ, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తూ సంక్షేమ పాలన సాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ప్రతీ



కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు. చిత్రంలో మంత్రి బొత్స

ఒక్కరూ తమ ఓటు వైఎస్సార్‌సీపీకి వేయాలని, తమ వారితో వేయించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డైరెక్టర్లు ఎస్.ప్రసాద్‌రావు, మాధవి, విశాఖ యువజన చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు తాళాసు సాయిమోహన్, సెక్రటరీ భోగి ప్రవీణ్‌కుమార్, అడ్వయిజర్ భోగి గణేష్, దేవరశెట్టి గోవిందరావు, పాట్నూరు సతీష్, గుడ్ల సత్యనారాయణ, గుట్ల కృష్ణారావు, సూరు సాయిరాం, వారణాసి, రమేష్, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు

సీతమ్మధార: జీవీఎంసీ 55వ వార్డుకు చెందిన బీజేపీ, జనసేన నాయకులు, యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయంలో ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు సమక్షంలో వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలని కోరారు. ప్రతి ఒక్కరికీ పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 55వ వార్డు కార్పొరేటర్



బీజేపీ, జనసేన శ్రేణులు, యువకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కె.కె.రాజు

కె.వి.ఎన్.శశికళ, పార్టీలో చేరిన మల్లవరపు అరుణ్, అశోక్, సిద్ధు, నవీన్‌తోపాటు నాయకులు సోండి సురేష్, పైడి రత్నాకర్, ఎడ్ల సిద్ధార్థ, ఎరంశెట్టి శ్రీను, వార్డు నాయకులు పాల్గొన్నారు.

కళాకారులకు జీవం పోసిన 'స్నేహాంజలి'

సీతంపేట: స్నేహాంజలి సంగీత నృత్యాలయం(డ్యాన్స్ వింగ్) 15వ వార్షికోత్సవం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథి విజయ్ నిర్మాణ్ కంపెనీ అధినేత ఎస్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ 33 ఏళ్లుగా స్నేహాంజలి సంస్థ ఎంతో మంది కళాకారులను తీర్చిదిద్దిందన్నారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ స్నేహాంజలి సంస్థ అనేక మంది కళాకారులకు జీవం పోసిందన్నారు. స్నేహాంజలి సంస్థ వ్యవస్థాపకుడు వి.ఎన్.మూర్తి ఆశయ సాధనకు ఆయన భార్య శైలజ, కుమారులు సత్యనారాయణ, బాలు కృషి చేస్తున్నారని అభినందించారు. తారలు దిగి వచ్చిన వేళ కార్యక్రమం తిరిగి ప్రారంభిస్తున్నట్టు సంస్థ నిర్వాహకులు ప్రకటించి, దానికి సంబంధించిన పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు. స్నేహాంజలి విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. జబర్దస్త్ నటుడు చదలవాడ రమేష్, గీత్ సంగీత్ అధినేత మహమ్మద్ ఆలీఖాన్, సినీ నటుడు ధనుంజయ్, వీరూమామ, రామారావు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న అతిథులు, విద్యార్థులు